క్లుప్తంగా

435 మంది ఏయూ విద్యార్థులకు ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో వీసీ ఆచార్య రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో భాగంగా ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగాల నుంచి 435 మంది విద్యార్థులు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు సాధించారు. వాణిజ్యం, నిర్వహణ అధ్యయనాల విభాగం నుంచి 205 మంది ఎంపికయ్యారు. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) 18 మందిని మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా నియమించుకుంది. ఎంపికైన విద్యార్థులకు ఆఫర్ లెటర్లను వీసీ ఆచార్య రాజశేఖర్ తన కార్యాలయంలో మంగళవారం అందించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రాంబాబు, డీసీఎంఎస్ అధిపతి ప్రొఫెసర్ జె.రవి, సౌత్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డైరెక్టర్ వి.ఆర్.రెడ్డి, ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ గణేష్ పాల్గొన్నారు.

బాలుర ప్రత్యేక గృహానికి భవనం ప్రారంభం



భవనం ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర ప్రత్యేక గృహానికి నూతన భవనాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం ప్రారంభించారు. ఇక్కడ సుమారు రూ.60 లక్షలతో గత ప్రభుత్వంలో భవనం నిర్మించారు. ఈ భవనం నిర్మాణం పూర్తయి సుమారు ఏడాది దాటిపోయింది. అప్పటి నుంచి వినియోగించకుండా ఖాళీగా ఉన్న ఈ భవనాన్ని మంత్రి చేతులు మీదుగా మాతాశిశు సంక్షేమ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాల నిర్వహణ మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇలాంటి గృహాల నిర్వహణ బాధ్యతయుతంగా ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, కార్పొరేటర్లు కెల్ల సునీత, మద్దిల రామలక్ష్మి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ పీడీ కె.వి.రామలక్ష్మి, ఆర్‌జేడీ జి.చిన్మయాదేవి, ప్రత్యేక, పరిశీలన, వీధి బాలుర, బాలిక గృహాల పర్యావేక్షణాధికార్లు అన్నాజీ, షణ్ముఖరావు, రామణ, నయూమీ, సీడబ్ల్యూసీ సభ్యులు పాల్గొన్నారు.

'యంగ్ హార్ట్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న క్రికెటర్ శ్రీకర్‌భరత్, సృజన, మెడికవర్ వైద్యులు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'యంగ్ హార్ట్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్'ను మంగళవారం ప్రారంభించారు. హాస్పిటల్ సెమినార్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో క్రికెటర్ కోన శ్రీకర్‌భరత్, మెడికవర్ చైల్డ్ అండ్ ఉమెన్ విభాగం సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సృజన, వైద్యులు కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకర్ భరత్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సమాజంలో యువత ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడుతున్నారన్నారు. ఒత్తిడి, శారీక శ్రమ లేకపోవడం, వంశపరపర్యంగా వచ్చే సమస్యలు దీనికి కారణమవుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ముందుగా వైద్య పరీక్షల చేయించుకోవడం ద్వారా భవిష్యత్‌లో వచ్చే గుండె సమస్యలకు పరిష్కారం చూపవచ్చన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ హేమంత్ బెహ్రా మాట్లాడుతూ ప్రస్తుతం 30 – 50 ఏళ్ల మధ్య వయసు వారికే ఎక్కువగా గుండె జబ్బులు నమోదవుతున్నాయన్నారు. యువతలో అవగాహన పెంచడంలో భాగంగానే 'యంగ్ హార్ట్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్'కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ గ్రూప్ సీఓవో మహేష్ దెగ్లూర్కర్, ఏపీ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మజ, కార్డియాలజిస్ట్ కరణాకర్ పాడి, సెంటర్ హెడ్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కళావిహీనం

- నిర్లక్ష్యానికి గురవుతున్న శాంతివనం
- పార్కులో కనిపించని మొక్కలు
- ఆధునికీకరణపై దృష్టి సారించని అధికారులు



పశువులకు ఆహారమై కనుమరుగైన మొక్కలు

ఏయూ క్యాంపస్ : సాగర తీరంలో ఆహ్లాదాన్ని పంచడానికి ఏర్పాటు చేసిన శాంతివనం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్క్ ప్రస్తుతం కళావిహీనంగా మారింది. బీచ్‌రోడ్డులో విక్టరీ ఎట్ సీ ఎదురుగా ఉన్న ఈ పార్క్‌ని దశాబ్దాల క్రితం నిర్మించారు. పార్క్ మధ్యలో శాంతి స్తూపాన్ని ఏర్పాటు చేశారు. చుట్టూ ఒక క్రమపద్ధతిలో ఇతర శిల్పాలు అమర్చారు. గతంలో మధ్యలో ఉన్న ప్రధాన స్తూపం వద్ద లోహంతో చేసిన ప్రత్యేకమైన పలక కూడా ఉండేది. కాల గమనంలో అవన్నీ కనుమరుగయ్యాయి. తాజాగా ఈ స్తూపంపై ఉన్న పలకలు సైతం ఊడిపోయి కళావిహీనంగా మారింది.

శిథిలావస్థలో స్తూపం

పార్క్ మధ్యలో నిర్మించిన స్తూపం శిథిలమవుతోంది. స్తూపంపై ఒకవైపు పలక పూర్తిగా ఊడిపోయింది. ఈ స్తూపం కింది భాగంలో మర్రి మొక్కలు మెలిచి ముప్పు తెచ్చే విధంగా మారుతున్నాయి. ఈ స్తూపం చుట్టూ నిర్మించిన గుండ్రని ప్రాంగణం సైతం శిథిలమవుతోంది. ఇప్పటికే దీనిపై ఉండే పలకలు విరిగిపోయాయి. స్తూపం చుట్టూ ఉన్న ప్రాంతంలో వ్యర్థాలు పడేస్తున్నారు. శాంతివనంలో ప్రధాన స్తూపం చుట్టూ ఏర్పాటు చేసిన శిల్పాలు పూర్తిగా కళ కోల్పోయాయి. వీటికి మరమ్మతులు చేయడం, రంగులు వేయడం వంటివి చేయడం లేదు. దీంతో అధ్వానంగా మారాయి. వీటికి కాస్త మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉంది. ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ యోగా డే వేడుకలకు బీచ్‌రోడ్డును ఆధునికీకరించారు. ఆ సమయంలో ఈ పార్క్‌ని పూర్తిగా విస్మరించారు. పాత వాటికి మరమ్మతులు చేసి సుందరంగా తీర్చిదిద్దాల్సిన అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదు. కొత్తగా ఖర్చు చేస్తూ రెండు బొమ్మలను మాత్రం పార్క్‌లో ఏర్పాటు చేశారు. ఈ పార్క్‌లో ఉన్న వయోలిన్ విద్వాంసులు ద్వారం వెంకటస్వామి విగ్రహం సైతం పక్షుల వ్యర్థాలతో కళావిహీనంగా దర్శనమిస్తోంది. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ పార్క్‌ని పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పశువులకు ఆహారమైన మొక్కలు

పార్క్‌కి రెండు వైపులా గతంలో మొక్కలు నాటారు. పార్క్‌లో పచ్చదనాన్ని పెంచేందుకు నాటినవి పశువుల కారణంగా కనుమరుగయ్యాయి. దీంతో పార్క్‌లో నీడనిచ్చే వృక్షాలు లేకుండా పోయాయి. ఇక్కడ పశువులు తినని... ఏపుగా పెరిగే స్వభావమున్న మొక్కలు నాటడం, వాటికి చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. నిత్యం పదుల సంఖ్యలో పశువులు స్వేచ్ఛగా ఇక్కడి పార్క్‌లో ఉన్న గడ్డిని తినడానికి వస్తుంటాయి. అదే సమయంలో పార్క్‌లోని మొక్కలను సైతం అవి భుజించేస్తున్నాయి. వీటికి అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



శాంతివనం ప్రాంగణంలోని ద్వారం వెంకట స్వామి విగ్రహం పరిస్థితి ఇదీ



బీచ్‌రోడ్డులో నిర్లక్ష్యానికి గురై కళావిహీనంగా మారిన శాంతివనం



వ్యర్థాలతో నిండిన శాంతిస్తూపం ప్రాంగణం



స్తూపం వద్ద మొలిచిన మర్రి మొక్కలు



కళావిహీనంగా దర్శనమిస్తున్న స్తూపాలు

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

ఎంవీపీ కాలనీ : ఎంవీపీ కాలనీ అప్పుఘర్ కూడలి వద్ద చల్లా కృష్ణంరాజు (45) అనే వ్యక్తిపై కొందరు దాడికి పాల్పడిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 3న జరిగిన ఘటనపై బాధితుడి ఫిర్యాదు ఆధారంగా మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కృష్ణంరాజుది విజయవాడలోని పాయకపురం సమీప సుందరయ్యనగర్ కాగా అతను దేవరాపల్లి సమీపంలో రియల్ ఎస్టేట్, క్వారీ వ్యాపారం చేస్తున్నాడు. ఇటీవల విశాఖ నగరానికి వచ్చిన అతను ఓ కారు బుక్ చేసుకున్నాడు. ఆ కారు డ్రైవర్ సిరిగిడి రాజుతోపాటు రుషికొండ, భీమిలి రోడ్డులో విహరించాడు. అనంతరం అప్పుఘర్‌కు చేరుకున్నాక కారు డ్రైవర్ రాజు కిందకు దిగి వెళ్లాడు. ఆ సమయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కారు వద్దకు వచ్చి కృష్ణంరాజును కిందకు దిగమని హెచ్చరించారు. అయితే తాను కారు అద్దెకు తీసుకున్నట్లు వెల్లడించడంతో ఒక్కసారిగా దాడి చేశారు. దీంతో గాయాలపాలైన కృష్ణంరాజు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేరారు. ఆ దాడిలో ఆరుగురు వ్యక్తులు పాల్గొనగా వారు డ్రైవర్ రాజుకు తెలిసిన వారని కృష్ణంరాజు ఫిర్యాదులో ఆరోపించాడు. తనపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పేర్కొనడంతో ఆ ఆరుగురిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న ఉపాధ్యాయులకు సత్కారం

మద్దిలపాలెం : జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న విశాఖ జిల్లాకు చెందిన ఉపాధ్యాయులను బాల వికాస ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ, గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 14న సత్కరించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాశ రావు తెలిపారు. అవార్డు గ్రహీతలు తిరుమల శ్రీదేవి, జి.కుమార స్వామి, జి.ఎం.సుజాత, ఎం.మోహనరావును సత్కరిస్తామని తెలిపారు. 14న ఉదయం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆచార్య వి.బాలమోహన్ దాస్, జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ కుమార్, ఐఆర్ఎస్ అధికారి రవికిరణ్, విశ్రాంత ఐపీఎస్ అధికారి అత్తిలి సుధాకరరావు హాజరవుతారని తెలిపారు.

కూటమి ప్రభుత్వ మోసాలపై నిలదీయండి



కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ 18వ వార్డు అధ్యక్షుడు కల్యాణ్, నాయకులు

ఎంవీపీ కాలనీ : సార్వత్రిక ఎన్నికల మేనిఫెస్టోలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, కూటమి ప్రభుత్వం చేసిన మోసపూరిత హామీలపై నిలదీయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజలకు సూచించారు. ఈ మేరకు బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ కార్యక్రమం 18వ వార్డులో నిర్వహించారు. బూత్ నంబర్ 94 పరిధిలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ వార్డు అధ్యక్షుడు ఉమ్మిడి కల్యాణ్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో గెలిపొందిందన్నారు. ఓటర్లను మోసం చేసి అడ్డదారిలో గద్దెనెక్కిందన్నారు. ఏడాదిన్నర పాలనలో ఆయా హామీలను అమలు చేయడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఏ ఒక్క హామీనీ పూర్తి స్థాయిలో అమలు చేయకుండా పేద, సామాన్యుల నడ్డి విరిచారని దుయ్యబట్టారు. కూటమి పాలకుల మోసాలపై ఆ పార్టీల నాయకులను ప్రజలంతా నిలదీయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు మహిళ విభాగం అధ్యక్షురాలు ధనలక్ష్మి, బీఎల్ దల్లై ఈశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దల్లై గోవిందరావు, బీసీసీఎల్ అధ్యక్షుడు దాసు, వర్మ, ఎల్లాజీ, ఎర్రయ్య, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ముందస్తు పరీక్షలతో క్షయ నివారణ సాధ్యం

ఆరిలోవ : జీవీఎంసీ పదకొండో వార్డు గాంధీనగర్ పాఠశాల ఆవరణలో బాలాజీనగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ప్రజలకు క్షయ వ్యాధి (టీబీ)పై అవగాహన కల్పించారు. ముందస్తు పరీక్షలతో క్షయను నివారించవచ్చని సూచించారు. టీబీ లక్షణాలు, దాని నివారణపై వివరించారు. అనంతరం కెల్ల పరీక్షలు జరిపారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రాగతి అచ్చుతరావు, మూది అప్పారావు, ఏఎన్ఎంలు ఎం.సరళ, లోవకుమారి, ఆశా వర్కర్ జయ పాల్గొన్నారు.

తీరప్రాంత భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీఐ రమేష్, తదితరులు

ఎంవీపీ కాలనీ : తీరప్రాంత భద్రతపై కోస్టల్ సెక్యూరిటీ పోలీస్, అటవీశాఖ, మత్స్యశాఖ అధికారులు సంయుక్తంగా మత్స్యకారులకు మంగళవారం అవగాహన కల్పించారు. జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోర్టు కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ సీఐ రమేష్ మాట్లాడుతూ సముద్రంలో వేటకు వెళ్లే సమయంలో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానిత సామగ్రి, మన జిల్లాకు సంబంధం లేని ఇతర బోట్లు తీరంలో కనిపిస్తే తక్షణమే కోస్టల్ సెక్యూరిటీ పోలీసులకు, జిల్లా ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కొన్ని సందర్భాల్లో అనుమానాస్పందంగా దొరికే పరికరాలను, బాక్స్‌లను తెరిస్తే ప్రమాదాలకు గురవుతారన్నారు. వాటిని నేవీ కోస్ట్‌గార్డ్స్‌కు అప్పగించాలని సూచించారు. తీరప్రాంత భద్రత అందరి బాధ్యత అనే విషయాన్ని మత్స్యకారులు గమనించాలన్నారు. ఇందుకు అనుగుణంగా పోలీసులకు, ప్రభుత్వానికి సహకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారి చిట్టిబాబు, గ్రామ పెద్దలు పరసన్న, తెడ్డు రాజు, తెడ్డు శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించాలి

గేర్ మార్కింగ్‌పై సదస్సులో వక్తలు



సదస్సుకు హాజరైన అధికారులు, మత్స్యకారులు

ఏయూ క్యాంపస్ : కేంద్ర మత్స్య సాంకేతిక పరిశోధన సంస్థ (సీఐఎఫ్‌టీ) ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని సంస్థ కార్యాలయంలో భారతీయ మత్స్య పరిశ్రమలో గేర్ మార్కింగ్ - అవకాశాలు, సవాళ్ల అంశంపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించడం అత్యంత అవసరమన్నారు. సవాళ్లు, ఆచరణాత్మక పరిష్కారాల దిశగా ఆలోచించేందుకు గేర్ మార్కింగ్ వర్క్‌షాప్ దోహదపడుతుందన్నారు. గేర్ మార్కింగ్‌పై జాతీయ మార్గదర్శకాలను రూపొందించడానికి మత్స్యకారులు తమ అభిప్రాయాలను, ఆలోచనలను స్వేచ్ఛగా పంచుకోవాలని సూచించారు. ఐసీఏఆర్ - సీఐఎఫ్‌టీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఆర్.రఘు ప్రకాష్ మాట్లాడుతూ గేర్ మార్కింగ్‌పై ప్రపంచ స్థాయిలో జరుగుతున్న విధానాలను వివరించారు. చట్ట విరుద్ధంగా చేపల వేటను తగ్గించడానికి, వివాదాలను పరిష్కరించడానికి ఒక సాధనంగా నిలుస్తుందన్నారు. గేర్ మార్కింగ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉపయోగించే రంగుల కోడింగ్‌తోపాటు అధునాతన రేడియో ఫ్రీక్వెన్సీ(ఆర్ఎఫ్) ట్యాగ్‌ల వినియోగం, తదితర అంశాలను వివరించారు. డాక్టర్ బి.మధుసూధనరావు మాట్లాడుతూ పెరుగుతున్న సముద్ర కాలుష్యం, చట్ట విరుద్ధమైన చేపల వేటను నియంత్రించడానికి గేర్ ట్రేసబిలిటీని ఉపయోగించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఏపీ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్ల సంఘం, డాల్ఫిన్ బోట్ ఆపరేటర్లు, వలల తయారీదారులు, చిన్న తరహా మత్స్యకారులు, మత్స్య సంస్థలు, ఎన్‌జీవోలు, ఫిషింగ్ గేర్ తయారీ సంస్థల ప్రతినిధులు స్వయంగా సెషన్‌లో పాల్గొని తమ ఆలోచనలను పంచుకున్నారు. దేశంలో గేర్ మార్కింగ్ అమలు చేయడానికి ఉన్న అవకాశాలపై ప్రత్యేక చర్చ నిర్వహించారు. డాక్టర్ యు.శ్రీధర్ సమన్వయం చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త జి.కమై తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ద్రోహం



ఇసుకతోటలో ర్యాలీ నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

- నేటికీ సంక్షేమ బోర్డు పునరుద్ధరించని కూటమి ప్రభుత్వం
- సమస్యలు పరిష్కరించి ఆదుకోవాలని భారీ ర్యాలీ

మద్దిలపాలెం : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) పిలుపు మేరకు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని, పెండిగ్‌లో ఉన్న కార్మికుల క్లెయిమ్‌ల నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఇసుకతోట పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. అక్కడి నుంచి ఇసుకతోట పోస్టాఫీసుకు వెళ్లి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు సమస్యల పరిష్కారానికి స్పందించాలని కోరుతూ పోస్ట్‌కార్డులు పంపించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ మాట్లాడుతూ రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికుల జీవన పరిస్థితులు మారలేదన్నారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని, పెండింగ్ క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. సంక్షేమ బోర్డులో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. కార్మికుల ప్రయోజనాల కోసం నిధులు ఖర్చు చేయకుండా కాలయాపన చేయడం కార్మిక ద్రోహమే అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సంక్షేమ బోర్డును పునః ప్రారంభించాలని కోరారు. 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.5 వేల పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇసుకతోట భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) అధ్యక్షుడు బి.ప్రతాప్, సెక్రటరీ ఎం.నాగేశ్వరరావు, నాయకులు జి.పాపారావు, బి.నారాయణ, పి.ఈశ్వరరావు, డి.పైడిరాజు, సీహెచ్ చిన్న, సత్య పాల్గొన్నారు

గెడ్డల్లోని వ్యర్థాలు సత్వరమే తొలగించండి



ఇసుకతోట గెడ్డను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

మద్దిలపాలెం : నగరంలో వర్షాలు కురుస్తున్నందున గెడ్డలు, కాలువల్లోని వ్యర్థాలు పేరుకుపోయి వరదనీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని, సత్వరమే వ్యర్థాలు తొలగించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. మంగళవారం ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జీవీఎంసీ 3వ జోన్ 16వ వార్డులోని ఇసుకతోట వద్ద కృష్ణ మందిరాన్ని ఆనుకుని ఉన్న ప్రధాన గెడ్డను పరిశీలించారు. అనంతరం గెడ్డలోని వ్యర్థాలను జెట్ మిషన్, జేసీబీతో తొలగింపజేయించారు. గెడ్డల్లో వ్యర్థాలు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడకుండా స్టీల్ మెస్‌ను వారం రోజుల్లో ఏర్పాటు చేయాలని పర్యవేక్షక ఇంజినీర్ పల్లమరాజును ఆదేశించారు. ఎక్కడెక్కడ స్టీల్‌మెస్‌లు అవసరమో ప్రతిపాదనలు తయారు చేసి నివేదించాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఆదేశించారు. నిత్యం ప్రధాన రోడ్లను శుభ్రపరచాలన్నారు.

జీవీఎంసీ 16వ వార్డు శానిటరీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు

ఇసుకతోట జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన తోపుడు బండి కింద వ్యర్థాలు అధికంగా ఉండడంతో జరిమానా విధించమని జీవీఎంసీ 16వ వార్డు శానిటరీ కార్యదర్శి గౌతమిని ఆదేశించారు. అలాగే ఆమె పరిధిలో ఎన్ని వాహనాలున్నాయి..?, ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారో వారి హాజరు వివరాలు చూపించమనగా... ఆమె తగిన వివరాలు చూపించకపోవడంతో షోకాజ్ నోటీసు జారీ చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. అనంతరం అపోలో ఫార్మసీ సమీపంలో గ్రీన్ బెల్ట్‌లో వ్యర్థాలు పేరుకుపోవడంతో పరిశుభ్రంగా ఉంచాలని హార్టికల్చర్ ఆఫీసర్ వాసుకిని ఆదేశించారు. కార్యనిర్వాహక ఇంజినీర్ మురళీకృష్ణ, గంగాధర్, సుధాకర్, ఏఎంవోహెచ్ బి.ప్రసాదరావు, సహాయక ఇంజినీరు రహీం పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ అందించాలి

మద్దిలపాలెం : గిరిజన యువతను సాధికారత దిశగా నడిపించే విధంగా నైపుణ్య శిక్షణ అందించాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదివాసీ యువతలో నైపుణ్యాలను పెంపొందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. సాధారణ విద్యతోపాటు ప్రత్యేకమైన నైపుణ్యాలు అందించే శిక్షణ కార్యక్రమాలను ప్రణాళికాయుతంగా ఆదివాసీ యువత కోసం నిర్వహించాలని సూచించారు. సోషల్ ఇంక్లూషన్ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ శంకువానిపాలెంలో ఇటీవల సర్వే నిర్వహించామని, అక్కడి యువతకు ఉపాధికి దోహదపడే నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఏయూలో వివిధ కోర్సులను అభ్యసిస్తున్న 25 మందికి పైగా ఎస్టీ యువతను గుర్తించి వారికి సైతం త్వరలో అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్, బొల్లినేని మెడ్ స్కిల్స్ భాగస్వామ్యంతో వీరికి నైపుణ్య శిక్షణ అందిస్తామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, రీసెర్చ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ ఆచార్య వి.వల్లి కుమారి, డీన్ ఆచార్య కిషోర్ బాబు పాల్గొన్నారు.